# గెలుపూ-ఓటమి

“ఎందుకమ్మా ఆ ముసిముసినవ్వులు?”

“నిన్ను చూసే...”

“నన్నెందుకు చూసి?”

సమాధానంగా బుర్ర గోక్కున్నాడు గోపాలం. అది చూసి ఆమె ప్రదర్శించిన కోపం మరిచిపోయి కిలకిలా నవ్వేసింది కల్పన.

“ఎందుకేం ఆ నవ్వు?” పాఠం అప్పజెప్పినట్లున్నప్పటికీ ఆ ప్రశ్న తాత్కాలికంగా గోపాలాన్ని రక్షించింది. తానెందుకు నవ్విందీ చెప్పనవసరం లేదు.

“మరేం... ” జారిన పైట సర్దుకుంది కల్పన. నవ్వాపుకునేందుకు ప్రయత్నం చేస్తూ.

“మీరా ముత్యాలు ఏరుకుంటారా ఏం?” అనడిగింది.

“ఊహూ... చూసి మురిసిపోతాను.”

“అయితే అలాగే మురుస్తూవుండండి. నేనింక పోతున్నాను.” కల్పన లేచి నిలబడి పైట భుజం మీదకు సర్దుకుంది. ముంగురులు సవరించుకుంది. చిరుగాలి ఆమె ముంగురులతో నుదుట కార్టూన్ బొమ్మలు గీస్తానంటోంది. ఆమె వద్దంటోంది.

“ఒక్క ఐదు నిముషాలు ప్లీజ్!” అంతవరకూ చేతులు మెలి వేసుకుని దొప్పలా తలక్రింద పెట్టుకుని పడుకున్న గోపాలం మోచేతిమీదికి లేచి, అనంతశయనం పోజులో ప్రార్థించాడు.

‘నేనతగాడి పార్టీయే...’ అన్నట్లు ఆమె సిల్కు పైట శాటిన్ జాకెట్టు భుజం మీద నుంచి జారిపోయింది!

“అమ్మబాబోయ్! మీ సొమ్మేం పోయింది? నాకవతల పనులున్నాయ్!” మోకాళ్లమీద వాలి కూర్చుని చిలిపిగా చూసి, కళ్లు టపటపలాడించింది కల్పన.

“ఏమిటో ఆ పనులు? ఇలా చూడు, ఇక్కడ ఈ చక్కని మెత్తని పచ్చిక నీ అడుగులకు మడుగులొత్తుతానంటుంది. ఈ చిరుగాలి నీ చెంపలను తాకి మురిసిపోతోంది. అదో ఆకాశం నీ కోసం నక్షత్రాలను పొదుగుతూంది...”

“తమరు హాయిగా వెల్లికిలా పడుకుని, కవిత్వం చెబుతున్నారు” అంటూ పూర్తి చేసింది కూర్చుంటూ.

వెంటనే ఆ పారవశ్యం ప్రదర్శించేందుకు ఠపీమని లేచి కూచున్నాడు గోపాలం: “ఎగ్జాక్టలీ! నేనే ఓ రాజునైతేనా నీకు నా మెళ్లోని హారం ఇచ్చేద్దును” అన్నాడు.

“నయం! ఆ టై విప్పి నా ముఖాన పారెయ్యకండిమీ!..” కొంచెం జరిగి మంచిముత్యాలు గాజుగళాసులో ఒలకబోసినట్లు కిలకిలమంది కల్పన.

రెండు క్షణాలు మౌనంగా వుండి గోపాలం, “కల్పనా!” అన్నాడు.

అతగాడికి భాషంతా మరిచిపోయినట్లయింది. ముందే తన ప్రశ్నలు ఊహించుకుంటుందా ఏమిటి చెప్మా ఈ పిల్ల? అనుకున్నాడు.

కల్పనతోటి స్నేహం సంవత్సరం నాటిదే అయినా తనకాపిల్లతో సాహచర్యం యుగయుగాల నాటిదనిపించింది. తననాపిల్ల ఇలాగే ఉడికిస్తూన్నట్లనిపించింది.

ఒక్క టెన్నిస్ ఆటలోతప్ప ఇంకెందులో ఈ పిల్లతో పోటీ పడగలను నేను? ఆ పిల్లమీదికి పెంకిమాట, కొంటెమాట విసరటం, గోడమీదికి బలం పూనీ, సూటిగా బంతిని విసిరికొట్టడమే. ఫెడీమని తిరిగివచ్చి తగుల్తుంది.

ఎంతటి పురుషుడి స్వాతిశయాన్నయినా ఆమె కనుబొమల ముడితో తునాతునకలు చేస్తుంది.

మొదటిసారి కల్పనతో తనకు పరిచయమైన దృశ్యం గుర్తుకువస్తే ఇవాళకూడా ఒళ్లు పులకరిస్తుంది గోపాలానికి.

వీరాజీ

***

ఒక్క టెన్నిస్ ఆడుతున్నప్పుడుతప్ప, గోపాలం ఎప్పుడూ సీరియస్‌గా వుండడు. వుండలేడు! సాధారణంగా అతని మిత్రబృందం ఎవ్వరూ అతనితో చమత్కార ద్వంద్వయుద్ధానికి తలపడరు. పైగా తెగమోసేస్తారు.

అది ఒకసారి పిక్నిక్‌కి వెళ్లినప్పటి సంగతి.

క్యారమ్స్ ఆడుతున్నప్పుడు. క్యారమ్స్ ఆడటం కంటే ఎక్కువగా గోపాలం మిగతా అందర్నీ ఆటపట్టిస్తాడు!

సరిగ్గా ఆవేళ ఆ క్యారమ్సే అతన్ని కల్పన చూపులకు ఎరచేసింది.

ఆంజనేయుల్ది ఛాన్సు. అతగాడి వాలకాన్ని చూసినప్పుడు గోపాలం “ఓరినీ! మరీ అంత కాన్సన్‌ట్రేషనా? నువ్వా పిక్కను కొట్టడానికి ఉద్యుక్తుడవుతున్నప్పుడు నీ తీరు నీకో నిలువుటద్దంతో చూపిస్తే...” అని వెటకారం చేశాడు.

నిజమే. ఆంజనేయులు తన మీది పళ్లతో కింద దవడను, అవి సుమారో అంగుళం లోతు దిగేలా గ్రుచ్చి, కళ్లను ఐమూలగా పెట్టి, తలకాయను నలభై డిగ్రీలూ, కాయాన్ని పాతిక డిగ్రీలూ వాల్చి, చెయ్యి వణకగా, పిక్కని స్ట్రయిక్ చేసేడు. రెడ్‌నూ, దాంతోటి వైట్‌నూ పాకెట్‌లోకి నెట్టాడు. కానీ గోపాలం మాటల్తో అతని మొహం కందిపోయింది. మూతి అతని సార్థకనామధేయాన్ని గుర్తు చేసింది.

ఈ కబురు, ప్రక్కనే మరో బోర్డుమీద ఆడుకుంటున్న అమ్మాయిలకు అందిపోయింది.

పకాలున నవ్వారు వాళ్లు-గోపాలం తెలివికీ, విట్టుకీ సంతోషపడి! కానీ నలుగురు విద్యుల్లతల్లోనూ ఒక చిన్నది నవ్వలేదు. గోపాలాన్ని ముడేసిన కనుబొమ్మలతో బుస్సున చూసింది.

ఆంజనేయులేం కందిపోయాడు, గోపాలం చమత్కారోక్తికి? ఆ పిల్ల చూపుల ఎర్రదనానికి కందిన గోపాలం మొహం చూడాలి! గోపాలం ఎందుకో గుంజాటన పడిపోయాడు.

పిక్నిక్ పార్టీ రంజుగానే వుంది.

కల్పన రెండు జడల్లోనూ ఒకటి ముందుకు కృష్ణసర్పంలా వుంది ఆమె కుచోన్నతం మీద! కాలరున్న జాకెట్టు ఆమె శంఖం లాంటి మెడను ఆప్యాయంగా హత్తుకుంది. దానిమీద అంచులేని నీలం చీర రాణించింది.

అటు తరువాత గోపాలం ఎంచేతనో విట్ మాస్టర్‌లాగా అదేపనిగా వాగడం మంచిది కాదనుకున్నాడు. ఒకటి రెండుసార్లు ఒకరిద్దరు మిత్రులు అతగాడిలోని ఈ అకస్మాత్ చైతన్యానికి లేదా స్తబ్ధత్వానికి విస్తుపోయి అడిగేసేరు కూడాను.

ఆనక గోపాలం ఉండబట్టక నిరంజనమూర్తి నడిగేడు-"ఓయ్, నిరంజన్! ఆ మూడో అమ్మాయి, ఇష్... చెయ్యి వద్దులే, అదే అదో ఆ నీలంకోక సన్నని రెడ్ చాప్ ఎవరూ?" అని.

నిరంజన్ సన్నగా నవ్వుతూ, చెయ్యి చూపుతూ, "ఓ! వయ్యారపుబొమ్మలా వుంది. అదో పైట జారిపోతే ఇలా తీసుకుంటుందే, జానకీ, ఆమెకీ, శారదకీ మధ్య... అవునా?"

గోపాలం నిరంజన్ మూతి మీద కొడదామనుకున్నాడు కానీ, "ఆ... పిల్లే. ఎవరో నేను ఎప్పుడూ చూడలేదు సుమా!" అన్నాడు. తనకు అత్యవసరంగా కలిగిన అనవసర కుతూహలాన్ని దాచప్రయత్నం చేస్తూ.

"రా! పరిచయం చేస్తా" దారి తీసేడు నిరంజన్.

"ఓయ్! ఓయ్! ప్లీజ్! నన్ను ఇలా బ్రతకనీ!" చెయ్యి వెనక్కు లాక్కున్నాడు గోపాలం.

"నో... నో... మనం ముందుతరం మనుషులం!" అంటూ నిరంజన్ గోపాలం చెయ్యి పుచ్చుకుని, "డోంట్ వర్రీ! ఆ పిల్ల నాకు కజిన్... వెడదాం రా... నేనెలాగా వెడుతున్నా!" అన్నాడు.

"ఐ సీ!"

గోపాలం లోపల సంతోషం, బయటకు ధైర్యం తెచ్చుకున్నాడు. కానీ, 'ఇంకా నయం ముందే చెప్పావ్. లేకపోతే ఏమి వాగుదునో!' అనుకుని లోలోపల మిత్రుణ్ని అభినందించేడు.

జానకి కొరకొరా, శారద చురచురా చూశారు. కల్పన "ఏం బావా!" అని పలకరించడంతో వాళ్లిద్దరూ కోపావేశం చల్లార్చేరు.

"నీకోసమే కల్పనా! మా అమ్మావాళ్లు నిన్నోసారి రమ్మన్నారు. ఊళ్లోకి వచ్చి చదువుతూ, మా ఇంటి కాదని హాస్టల్‌లో ఉన్నావు. పైగా ఇంటికైనా ఓమారు రావు!"

కల్పన నొచ్చుకుని, "లేదు బావా, తప్పకుండా. రేపు వస్తా, అత్తయ్యతో చెప్పు!" అంది.

ఆవేళ కల్పన బావ కివ్వవలసిన చనువూ, అతగాడి పక్కనే ఉన్న అపరిచిత వ్యక్తికి లజ్జ ప్రదర్శించిన తీరూ ముగ్ధుణ్ని చేసింది గోపాలాన్ని. ఆ దృశ్యం ఇప్పటికీ పటం కట్టినట్లు ఉంది అతని హృదయంలో.

"ఇతను గోపాలమూర్తి అని టెన్నిసులో దిట్ట!" పరిచయం చేసేడు గోపాలాన్ని నిరంజన్.

"ఈమె కల్పన... ఫస్టియర్... టెన్నిస్ అంటే చెవికోసుకుంటుంది!"

కల్పన నమస్కారం పెట్టింది.

గోపాలం అందుకుని ఏదో తన మామూలు ధోరణిలో వాగబోయి ఊరుకున్నాడు.

***

ఆ పరిచయం ఈ చనువుగా ఏర్పడింది.

నిజం చెప్పాలంటే ఇద్దరూ ఒకరికి చెప్పకుండా ఒకరు దోబూచులాడుతున్నా... అదే ప్రేమ అనే మాయదారి వ్యవహారం అని ఇరువురి హృదయాలూ స్వగతాలు పలికేయి.

గోపాలం తనే అన్ని విషయాల్లోనూ క్రింద పడవడంతో ఓటమి కాదు కదా? అనుకున్నాడు. లేకపోతే సీరియస్‌గా మాట్లాడాలనీ, తను ముఖ్యమైన సంగతులు మాట్లాడాలనీ అనుకుంటే కల్పన కెరటంలా చురుగ్గా చిలిపిగా ఉంది. గంభీరంగా బరువుగా, మేఘంలా ఉండాలని తాను ఎంత ప్రయత్నించినా అవదేం? పైగా తన నే గాడిదనో, కోతినో చేసి, గడ్డిపరక ఎలా ఉందనో, 'నా ముక్కు దుర'దనో అంటుంది కదా!

గోపాలం అన్నాడు-"సరే, అంత పాఠాలు చదువుతానంటే వెళదాం గానీ... ఒక్క మాట!" లేవనుంకించేడు.

"మరొక్క ఐదు నిమిషాలా?" అడిగింది. ఏదో చెప్పబోయే గోపాలం మూడ్ చితగ్గొట్టేసింది ఆ మాటతో కల్పన.

"కాదు వెంటనే పోదామనీ..." అని గబగబా నడిచేడు గోపాలం.

"నన్ను రిక్షా ఎక్కించి మరీ వెళ్లండి!" నవ్వుతూ అనుసరించింది కల్పన... "నేను పరుగెత్తలేను!"

***

బియ్యేకి ఆవేళ ఆఖరి పేపరు రాసింది కల్పన. గోపాలం ఎమ్మేకి మలిసంవత్సరం పరీక్ష రాయాలి.

పరీక్షలైన సాయంత్రం అది.

నీరసం ఎంతో దిగలాగుతూ ఉన్నా, నిద్రలేమితో కళ్లు ఎంతో లోతుకి పీక్కునిపోయినా, కల్పనలో ఒకరకమైన నిశ్చింత నిండింది. ఆమె కనుల కాంతులు నిండేయి.

"ఊహుం, నేను టాంక్‌బండ్ మీదికే గానీ, పబ్లిక్ గార్డెన్స్‌కి రాను."

గోపాలం ఆ పిల్ల ముడివేసిన ముద్దు మొహంలోకి చూస్తూ, "నిజంగా... గార్డెన్స్‌లో లాన్‌మీద కూర్చుంటే... ఎంత హాయిగా, రిఫ్రెష్‌డ్‌గా ఉంటుందో తెలుసా? అందులో ఇవాళ..." చెప్పేడు.

హఠం పట్టింది కల్పన. "ఉండదు... పైగా, మీకు పడుకోబుద్ధేస్తుంది. గడ్డి మీద... ఆనక కవిత్వం వస్తుంది. గడ్డిపరకలు తిన...." బుద్ధేస్తుంది అన్నమాట ఆమె నవ్వుల్లో కలిసిపోయింది.

"అమ్మాయ్! కాస్త నవ్వు దాచుకో... వేడి పరీక్షలు రాసిరాసి నీ మొహం ఎలా అరిటాకులా వాడిపోయిందో చూడు! అలా నవ్వితే మరింత నీరసం వచ్చేనూ!"

నిజంగా గోపాలం, ఆమె ఆరోగ్యం గురించి బెంగపడ్డాడు... "నీకు రిక్రియేషన్ అవసరం. పోనీ, సినిమా కెడదామా? నీ పరీక్షలైనందుకు అది నా ప్రెజెంటు!" చెప్పేడు.

"ఊహుం, నాకు ఐస్‌ఫ్రూట్ చాలు. కావాలంటే మీరు 'పేతా' తినండి!" చంటిపిల్లలా బుర్ర తిప్పింది కల్పన. నిజంగా పేపర్లన్నీ చాలా బాగా రాసిందేమో ఉద్వేగంగా ఉందామె మనసు.

"ఓకే!" గోపాలం వీగిపోయినట్లు "పదండి దేవిగారూ... టాంక్‌బండ్ మీదకే... అక్కడ రాతికుర్చీలో రాణిగారు ఉపవిష్టులైతే, ఈ దాసుడు ఐస్ క్యాండీ కొని సమర్పించుకుంటాడు!" అన్నాడు.

సిగ్గుపడిపోయింది. ఆమె పెదవుల మీద నవ్వులు వెలిగేయి. 'దేవీ!, రాణి' అనే మాటలు ఆమె హృదయాన గిలిగింతలు పెట్టేయి. వెంటనే అంది "అయ్యో! రాజాగారూ! గార్డెన్స్‌కే

ఈ కథను 19.10.1960
ఆంధ్రప్రభ సచిత్రవారపత్రికలో
ప్రచురించాము

వెడదాము."

"ఓహోహో... మరీ చిన్నతనం ఎక్కువైపోతోందే? అటంటే ఇటూ, ఇటంటే అటూ!"

కల్పన ఇంక గోపాలం దగ్గర భయం నటించినట్లు మొహం పెట్టేసింది. ఇలా అంది "పరీక్షలు పాసయ్యేనుగా... ఆ మాత్రం కోరిక తీర్చరూ!"

"పాసెప్పుడయ్యేవ్?"

"రాసినప్పుడే!"

ఇద్దరూ నవ్వుకున్నారు.

గూళ్లు చేరే పిట్టలు కానరావడం లేదు గానీ, సంధ్యవేళ పంజరాలను వదిలి బయటపడ్డట్టు జనం; జంటలూ, గుంపులుగా షైరుకి బయలుదేరేరు.

ఆఫీసుల నాలస్యంగా వదిలిన ఘటాలు, బస్‌స్టాపుల్లో ఆముదం తాగిన మొహంతో నించున్నాయి.

పాజమా-షేర్వాణీ, రెండు జడలూ, కాలికి హైహీల్డు బూట్లూ వేసుకున్న 'బొద్దుసుందరి' ఒకతె నైలాన్ చీరె, శాటిన్ బ్లౌజూ.... దాందుంపతెగ... అరటిపండు తొక్కమీద పడ్డ కాలైనా కాస్సేపు ఆగుతుందేమో గానీ, ఆ నైలాన్ పయిట శాటిన్ భుజంమీద ఉండదే!

ఆవిడ నెట్ వేసుకుంది. బంగాళాముడి ధరించింది. ఆమె అవయవాలను దాచవలసిన అవసరాన్ని ఆమె దుస్తులు గమనించవు. ఆ సంగతి ఆమె గమనించదు.

గోపాలం ఆ రెండు రకాల అలంకరణాలలోనూ కల్పనను ఊహించుకుని చూడబోయేడు. ఊహుఁ, ఇలాగుంటేనే బాగుంది కల్పన. ఈ ఖటావ్ వాయిల్ చీరలో, చెంపల మీదకి జారిన శిరోజాల సొంపులతో, ఒంటి జడా... చేతికి రెండేసి బంగారు గాజులు, కాలికి ఆకు చెప్పులు... రేకబంతిపువ్వు లాగుంది కల్పన.

నడభవంతిలాగుంది డబుల్ డెక్కర్ బస్సు. తప్పుకోమని అరిచింది హారన్.

ఉలిక్కిపడిన గోపాలం తప్పుకున్నాడు.

కల్పన నవ్వి, "ఏమిటో పరధ్యానం? భావకవిత్వం రాస్తారా ఇకమీదట?" అన్నది.

"ఏమ్మో పరీక్షలు లేకపోతే అలాగే చేద్దును... నిన్ను చూస్తే కవితావేశం వస్తోంది, తెలుసా?"

రంగురంగుల నాగరకత. రకరకాల వాలకాల జనతా, పబ్లిక్ గార్డెన్స్ కనులపండువుగా ఉంది.

చీకట్లు వాలినకొద్దీ దీపకాంతులు వాటిని మేసి బలుస్తున్నాయి.

కోనేటిలో రకరకాల పూలకుమల్లే పచ్చిక మెత్తలమీద అంగనలూ అంగరక్షకులూ... ఆడా... మగా...

నీటిచిమ్మటాలు చిమ్ముతున్న జల్లుమీద... రంగురంగుల కాంతిపుంజాలు నృత్యవిన్యాసాలు చేస్తున్నాయి.

కల్పన ఆ నీటితుంపర్లలోకి వెళ్లింది. ఆ పిల్ల మనసూ అలాగే తన్మయంగా ఉంది. జలద్వారాల క్రింద నుంచి అటూఇటూ తిరుగుతోంది. అక్కడ ఆడుకుంటున్న చిన్నపిల్లలతోనూ కలిసిపోయింది.

"కల్పనా! నీటి జల్లు క్రింద తడిస్తే ఏమవుతుందో తెలుసా?" గోపాలం వారించబోయేడు.

"లేదు, మాస్టారూ! మీ సివిక్సులో చదివిన జలుబు నాకు చెయ్యదు... ఇలా రండి... ఈ జల్లు కితకితలెడుతోంది చూడండి!"

వచ్చుని ఆమె నుదుట నీటితుంపరలు చిరుముత్యాల్లా నిలిచేయి.

గోపాలం ఇక తప్పదన్నట్లు, బూట్లు పాడైపోకుండా, నీళ్లు మడుగు కట్టిన ప్రాంతంలో కుప్పిగంతువేసి చిమ్మటాల జల్లు ననుభవించి "ఓకే! ఇంక పోదాం!" అన్నాడు క్రాఫును సవరించుకుంటూ. అతని ఆందోళనే గానీ ఆబాలగోపాలమూ, ఆనందంతో ఆవేశంతో కేరింతలు కొడుతున్నారు. అతని క్రాఫు సంగతెవడిక్కావాలి?

"అమ్మయ్య!" ఆయాసపడి మొత్తంమీద చతికిలపడ్డ కల్పన పైటకొంగుతో నుదురు ఒత్తుకుంది. "మొత్తానికి ఒకటయ్యింది!" నిబ్బరంగా అన్నది.

దూరంగా కొంతమంది యువకులు కూర్చుని కల్పనవంకే చూడడాన్ని ఈర్ష్యతో గమనిస్తూ 'ఏమి'టని అడిగేడు గోపాలం.

"బియ్యే."

"తర్వాత?" ఆనందంతో అతని మొహం నిండింది.

"ఉద్యోగం చేస్తా..." చెప్పింది కల్పన.

గోపాలం తనకి తెలియకుండానే హర్ట్ అయ్యేడు. "ఛీ! ఛీ! ఉద్యోగం చేస్తావా?" అన్నాడు.


అతనికా సమాధానం అనుకోని పిడుగులా పడింది. కమ్మని సంగీతంలో అపశ్రుతిలా తోచింది. అతనెన్నడూ ఊహించలేదు కల్పన ఉద్యోగం చేస్తుందని. "అంటే, మీ ఉద్దేశం ఏమిటి?" కల్పన సీరియస్‌గా అంది. ఇది మరింత నొప్పించింది గోపాలాన్ని.

అది గ్రహించినట్లామె అన్నది- "పురుషలక్షణం కదా ఉద్యోగం? అబలను నాకెందుకూ అనా మీ ఉద్దేశం...? నో, ఈ మధ్య అతివలకు కూడా ఉద్యోగం యొక్క అవసరం ఉందని తీర్మానించేం!"

ఆమె నవ్వులో ఈసారి ప్రయత్నం ఉంది. నిజానికి అది గోపాలం అహంకారాన్ని గేలి చేయడమే!

గోపాలం అడిగేడు "నీ కవసరం అన్నమాట."

కల్పన సెలయేటి త్రుళ్లింతలు మాని మంచినీళ్ల మడుగైనట్లు రెండు క్షణాలాగింది. "మరి?" అన్నది. ఒక గడ్డిపరక తుంపింది మునిగోళ్లతో. తిరిగి చెప్పింది. "మా అన్నయ్య నా చదువుకి ఎన్నో ఇబ్బందులు నెట్టుకొచ్చేడు. నిజంగా మా వదిన అంతకంటే సహకరించింది... లేకపోతే నన్ను ఆరేళ్లక్రితం ఓ అయ్య చేతబెట్టి ఉంటే... ఇవాళ మీరు ఐస్‌ఫ్రూట్ కొనాల్సిన



అవసరం ఉండకపోను!" గంభీరంగా చెప్పింది.

గోపాలం, వినడమే ఉత్తమం అనుకున్నట్లు మాట్లాడలేదు.

"అన్నయ్యకిద్దరు పిల్లలు. వదిన ఆరోగ్యం దిగజారిపోయింది. ఆవిడకి ట్రీట్‌మెంటు అవసరం!"

అతని మనస్సు వికలమైపోయింది. దాన్ని తేలిగ్గా తీసుకుందామంటే, అది మరింత బరువుగా గుండెల్లో మెదిలింది.

కల్పన ఉద్యోగం చేస్తే తనకేం? కల్పన తన భార్య కావాలికదా మరి! గోపాలానికి భార్య అవదల్చుకుంటే ఉద్యోగం ఎందుకు చెయ్యకూడదో...? అదేమైనా అనర్థమా? గోపాలానికిది తర్కంగా తోచలేదు.

తన భార్య ఆర్జించడం, ఉద్యోగం చెయ్యడం అతనికి ఊహించడం కూడా సయించలేదు. అంతేకాదు కల్పన 'అన్న' సంసారాన్ని పంచుకుంటాననంటుంది. మరి కళ్యాణం తలపెట్టదనేగా దానర్థం! తనను ప్రేమించిందని తను భ్రమిసిన పిల్లేనా ఈ మాటలు...? అతనికి ఆలోచనలు పాలుపోలేదు.

"అయితే నువ్వు... నువ్వు..." నీళ్లు నమిలాడు.

"నేను నేనే!" కల్పన తనకేసి ఇలా చూసుకుని నవ్వేసింది.

"అయితే ఉద్యోగం చేస్తావు. తర్వాత...?" కల్పన మామూలు ధోరణిలోనైతే ఆ ప్రశ్నతోనే అతగాడిని ఆటపట్టించేదేమో గానీ, అతగాడి కళ్లల్లోకి చూసి "తర్వాత?" అనడిగి సిగ్గుపడిపోయింది. ఆమె కళ్లల్లో కాంతి మెరిసింది. ఎదనేమో పులకింత జలదరించింది.

"మీరు కవిత్వం రాస్తానన్నారు గానీ, కన్నెమనసు బొత్తిగా తెలియదు సుమండీ!" తల దించుకుని, వేళ్లతో సున్నితంగా లాన్‌ను తాటిస్తూ చెప్పింది.

ఉద్యోగం అన్న మాట అతని తలలో దూరింతర్వాత కల్పన చిలిపితనం గోపాలాన్ని ఆహ్లాదపరచలేకపోయింది. అతని అహంకారం దెబ్బతిన్నది. "నేను దేనికి కవినవుతానులే... అసలు ఎడ్వాన్స్‌డ్ ఏజ్‌వాణ్నే గాదు! ఉత్త క్రూడ్ మనిషిని...!" కసిగా అన్నాడు.

కల్పన మొహం వాడినపువ్వులా కళావిహీనమైపోయింది. అతగాణ్ని లాలించలేకపోయింది.

సంవత్సరం నుంచీ ఉన్న పరిచయంలో తాను ఎన్ని రకాలుగా ఉడికించింది గోపాలాన్ని? ఒక్కోసారి ఇంటికివెళ్లి బోర్లా పడుక్కుని విలపించింది కూడాను. 'ఆయన్ని అవమానం చేసి ఆటపట్టించిందికి నేనెవర్తిని? నిజంగా ఆయనెంతో మంచివాడు, పురుషునిలో ఉండే ఆడదాన్ని అణచాలనే దురహంకారం ఆయనలో లేదు. ఉంటే నేనిలాగ వేళాపాళా లేకుండా వెటకారం చేయగలుగుదునా...' అని తలపోసేది. ఆ గోపాలమే, తన మనసు విప్పి మాట్లాడితే అపార్థం చేసుకునేటట్టు దిగజారిపోవడం ఆమెకి సమ్మెటపోటులా తగిలింది.

ఐస్ క్యాండీ వద్దంది కల్పన. మరి కొంటానని బతిమాలలేదు గోపాలం. కల్పనను రిక్షా ఎక్కించి, కాళ్లకి రబ్బరు సంకెళ్లు వేసినట్లు బరువుగా నడక సాగించాడు.

***

ఏ.జీ. ఆఫీసు సూపరింటెండెంట్ కొడుకూ, రిటైర్డ్ జడ్జీ గారి మనుమడూ అయిన గోపాలం, తనకు భార్య కావాలని కోరుకునే కన్నె ఉద్యోగం చేస్తానంటే విలవిలమనడంలో ఆశ్చర్యం లేదు. ఆడపిల్ల ఉద్యోగం అవసరంగా భావించే సందర్భాలు ఎలా ఉంటుంటాయో అతగాడు ఊహించలేడు.

'కోడలు రావాలనీ నట్టింట దీపమెట్టాలనీ' కోరే అతగాడి తల్లిదండ్రులకి ఉద్యోగం చేసే కోడలంటే కలలోకి రావడం కూడా ఇష్టముండదు.

కల్పన తనకి కానట్లూ... తన చేజారిన ముత్యమైనట్లూ వెలితిగా అనిపించింది. నిస్సత్తువ వచ్చింది. నాన్నకి గానీ, అమ్మకి గానీ 'మరేం... నా ప్రేయసి ఉద్యోగం చేస్తుంది. నేనామెను చేసుకుంటాను!' అని చెప్పగలగడం ఇంపాజిబుల్! అది తనకి కూడా తలవొంపు.

దానికీ సమాధానం వచ్చిందతని మనసులో 'ఈ సంవత్సరం తను చదువుతున్నాడుగా... మలి ఏడాది ఉద్యోగం మానీవచ్చుగా కల్పన? అప్పుడు ఇది సమస్య ఎలాగవుతుందీ?' అని సరిపుచ్చుకున్నాడు. కానీ తన కాబోయే భార్య ఉద్యోగం-ఒక ఆఫీసులో పదిమంది మధ్యా ఊడిగం... నాన్‌సెన్స్! అది తను సహించలేడు! కల్పన లావణ్యం, మార్దవం అప్పుడే పోతున్నట్లనిపించింది. గోపాలానికి చాలా కష్టమనిపించింది.

కల్పనతో చెబుదామా అంటే 'ఇంత సంకుచితం, ఇంత అహంకారం పనికిరా'దని కించపరుస్తుందని భయం వేసింది. 'పురోగతికి విద్యాధికులైన మీరే అడ్డుపుల్లలు వేస్తున్నావు! నేనేం మీ సొత్తునీ, మీ నగనీ కాదు. బానిసత్వం చెయ్యను!' అంటుందేమో?

అతగాడు తనలో తానే కల్పనకు బోధపరచడాన్ని మననం చేసుకున్నాడు. 'అది కాదు, కల్పనా! నువ్వంటే ప్రేమ గనకనే... నిన్ను నేనొక్కణ్నే ఆరాధిస్తాను. గుండెల్లో దాచుకుంటాను!' అని కానీ, అతని ఎదలో కల్పన 'నాకూ ఆదర్శాలున్నాయి, అవసరాలున్నాయి!' అని కేక వేసింది.


హతాశుడై, ఒళ్లు మండించుకుని "అయితే ఉరెట్టుకు చావనీ!" అనుకున్నాడు పిడికిలి బిగించి.

కల్పనను కూడా ఆలోచనలు ముట్టడించేశాయి. పరాధీనమైనట్లుంది ఎదను. ఆయనని నొప్పించేనా అని మథపడ్డది.

రెండు రోజుల్లో తనా ఊరు వదలి వెళ్లిపోతున్నది. గోపాలం ఎడబాటు సహించడం అసాధ్యమనిపించింది.

వరంగల్‌లో ఉద్యోగం చూసుకుంటే ఇంక ఈ ఊరు, ఈ జీవితం, ఇవి దూరమైపోడమే...? ఆ తలంపు భయాన్ని కలిగించింది. దాన్నించి తప్పించుకోవాలని చూసింది.

మిగతాది 34వ పేజీలో.....



.... 29వ పేజీ తరువాయి

కానీ అన్నయ్య? ఒక సంవత్సరం కనీసం గోపాలం ఎమ్మే అయిపోయేంతవరకూ, తాను అన్నయ్యని ఆదుకొనకపోతే తనకే ఆత్మతృప్తి వుండదు. అటు అన్నయ్యకి కూడా తనని కన్యధార పోయగల స్తోమతా ఉండదు అనుకుంది.

***

"సమాజం బాగుపడాలంటే స్త్రీలకి కూడా తమతోపాటు సమానప్రతిపత్తి కలిగించాలంటే..."

తను బల్లగుద్ది డిబేట్‌లో చేసిన ఉపన్యాసం కత్తిరింపులతో సహా, కల్పన ఉద్యోగసమస్య ఎదుట నిలుచుంది. ఒక వంక తను...

'అన్ని ఆదర్శాలూ అన్ని త్యాగాలూ అన్నీ తన నెత్తినే చుట్టుకోవాలా? తనొక్కడేనేమిటి ఈ సమాజం! అభిమానం తను చంపుకుంటే అదెంత ఈ సంఘానికి... మహాసముద్రంలో కాకిరెట్ట! ప్చ్... లాభంలేదు, కల్పనది మొండితనం, మూర్ఖత్వం. ఉద్యోగం చెయ్యడం సరదా. సంసారి పిల్లనవుదామని లేదు. ఉద్యోగాలు చేసి ఊళ్లేలుదామని... అసలు తనంటే ఆ పిల్లకెన్నడైనా ఖాతరుంటేగా! తనదే తప్పు... తన సర్వస్వం ఆ పిల్లకి సమర్పించడం తన తెలివి తక్కువ... సతమతమయ్యేడు గోపాలం. అమ్మో! కల్పనను ఎడబాయడం ఎలాగ?

పోనీ, ఈ సంవత్సరమే పెళ్లాడుతే? సిగ్గేసింది. మొదట కల్పనకి పెళ్లి చేసుకోమని చెప్పడం ఎలాగ? 'అన్నయ్యో, వదినో!' అని అలమటించే అమ్మాయిని 'నన్ను పెళ్లాడూ!' అని అడగడం ఎలాగ?

మరి తన తల్లిదండ్రుల మాట? ఎం.ఏ. కాకుండా పెళ్లి చేసుకోవడం ఇంటా వంటా లేదంటాడు నాన్న. ఎం.ఏ. పరీక్షలు కట్టరా అంటే నేనో అమ్మాయికి తాళిగడతానూ... అని అడగడం ఎలా?

పరిస్థితులను ఎదుర్కొనే సాహసం లేదు గోపాలానికి. అభిరుచులను కాదని అహంకారాన్ని తోసిరాజనడానికి శక్తి లేదు.

కల్పన మీద కోపం వచ్చింది. మర్నాడు వెళ్లననుకున్నాడు కసిగా.

అసలు కల్పన వాళ్ల ఊరుపోయి ఈ ప్లాట్‌ఫారమ్ ఈ విద్యాలయంలాగే తననూ మరిచిపోతుందేమో? 'అసలు మరోనాడు సీరియస్‌గా ఉంది గనుకనా?' అని తలపోశాడు.

తెల్లవార్లూ నిద్ర పట్టలేదు. పుస్తకం చేతబడితే ఒక్క ముక్క తలకెక్కలేదు. అద్దాల బీరువాలోనుంచి వెండి మెడల్సు తళతళ మెరిసి వకవకా నవ్వుతున్నట్లుంది. అవన్నీ స్త్రీ జనాభ్యుదయం మీద, స్త్రీత్వం మీద పొగిడి తాను సంపాయించినవే... తనలో తనకి డిబేట్ జరగడంతో గోపాలానికి తనమీద తనకి కోపం వచ్చింది!

***

ఉదయం కల్పన ఫోన్ చేసింది. తనకి కల్పనే అనిపించింది. వెంటనే ఎత్తుకోకపోతే అక్కడే పేపరు తిరగేస్తున్న నాన్న "హలోవ్!" అంటాడు. అవతలివైపు వాళ్ల పుట్టుపూర్వోత్తరాలు ఆరా తీసి, ఆనక తనని పనిగట్టుకుని క్రాస్‌పరీక్ష మొదలెడతాడు. తండ్రి ఉద్యోగం కాకపోయినా, తండ్రి పోలిక తన తండ్రిది!

గోపాలం ఫోను ఎత్తుకున్నాడు.

కల్పనే!

తండ్రికి ఆ ఫోన్ కాల్ తనది అని చెప్పాలిగా-"ఇది నాది, నాన్నారూ!" అన్నాడు.

అట్నుంచి కిలకిలమనేసింది కాబోలు కల్పన, రిసీవరు చెవిలో కితకితలు పెట్టింది. "ఆ మౌత్‌పీస్ మూసి చెప్పరాదూ? లేకపోతే కొంపతీసి... నన్నే మీ నాన్నగారికి పరిచయం చేస్తున్నారా?"

"నేనొస్తున్నా!" అన్నాడు గోపాలం.

"నేనూరికి పోవాలి మరి... త్వరగా రండి! రాకపోతే అంత ఒట్టు!"

గోపాలం కరిగిపోయేడు. కల్పన మళ్లీ అతని హృదయపీఠాన్ని పూజాపునస్కారాదులతో సహా అలంకరించింది.

అవును, తన వస్తువు... వస్తువేమిటి? తనదే కల్పన... తండ్రికేసి చూసి "నాన్నారూ! నా కల్పన" అని అందామనుకున్నాడు కానీ పెదాలు బిగుసుకుపోయేయి, విడలేదు.

***

కల్పన ఎంత ప్రయత్నం చేసినా ఎడబాటును సహించలేనన్న వ్యథ ఆమె మొహాన వులుముకుంది.

గోపాలం బేల వడిపోయేడు.

"మరి ఈ సంవత్సరం అంతా నన్నేం చేయమన్నారు?" అడిగింది కల్పన.

మరింత చలించిపోయేడు గోపాలం.

కల్పన కళ్లు కదిపితే స్రవించే మేఘాల్లాగున్నాయి.

"నీ ఇష్టం!" తన మాటలు ఉపసంహరించుకోగల శక్తి ఉంటే ఆ పని చేసేవాడే అతగాడు.

"సరే! వంట వండడం, వడియాలు పెట్టడం నేర్చుకుంటా!" నవ్వడానికి ఆమె ప్రయత్నం చేసింది.

"ఉద్యోగం ఎక్కడ చేస్తావు?" గోపాలం ప్రశ్న.

"ఆడపిల్లల బళ్లో!"

ఆ సమాధానం గోపాలానికి దవడమీద కొట్టినట్లు తగిలింది.

"కానీ, తమరు పర్మిషన్ గ్రాంట్ చెయ్యాలిగా!" అంది కల్పన.

గోపాలం చిత్తయిపోయేడు.

"కల్పనా! నీదే ఎప్పుడూ విజయం. నాది ఓటమే సుమా!" రైలు కిటికీ మీద ఉంచిన ఆమె చేతిని సున్నితంగా అదిమేడు.

ఆ చేతిమీద తన రెండో చెయ్యుంచింది కల్పన. "ఓటమి గానీ, గెలుపు గానీ మనిద్దరికీ విడివిడిగా ఉండవు!" అన్నది, తన కంటతడి అతని కంట పడకుండా.

"జయం!" అన్నట్లు కెనడా ఇంజను "భా"మంది. రైలు కదిలిపోయింది.

అతని 'తను'వక్కడే ఉన్నా, హృదయం రైలుతో వెళ్లిపోయింది.

ఆమె తనువు రైల్లో ఉన్నా, హృదయం ఇక్కడే ఉండిపోయింది!

■

